క్లుప్తంగా

ఘనంగా విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సుజాతనగర్: సీపీఎం నేత గుగులోత్ ధర్మా తల్లిదండ్రులైన సోమ్లానాయక్, బీబీనాయక్‌ల విగ్రహావిష్కరణ మంగపేట గ్రామంలో ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు. బానోత్ విజయాబాయి, నాయకులు లింగం పిచ్చిరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, చిమట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

28న పాదయాత్ర

ఇల్లెందురూరల్: కొమరారంను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీ వరకు దీక్షలు కొనసాగించి 28న కొమరారం నుంచి ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కొమరారంను మండలంగా ప్రకటించేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు వినతిపత్రం అందజేస్తామని వివరించారు. పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పక్షాలు భాగస్వాములు కావాలని కోరారు.

చెస్ విజేతకు అభినందన



జగన్మోహన్‌రావును అభినందిస్తున్న జీఎం షాలేమురాజు

ఇల్లెందు: పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన కోల్ ఇండియా స్థాయి చెస్ పోటీలలో 'ఫస్ట్ రన్నరప్'గా విజయం సాధించిన చెస్ క్రీడాకారుడు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోహన్‌రావును ఇల్లెందు ఏరియా సింగరేణి జీఎం షాలేమురాజు అభినందించారు. ఆదివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం చేతుల మీదుగా జగన్మోహన్‌రావు బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. జీఎం మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో మరిన్ని బహుమతులు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సింగరేణి సంస్థ క్రీడాకారులకు ఇస్తున్న సౌకర్యాలను, ప్రోత్సాహకాన్ని ప్రతి క్రీడాకారుడు వినియోగించుకోవాలని సింగరేణి సంస్థ పేరును నిలబెట్టాలని కోరారు. అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసు, ఇంజనీర్ జి.ప్రభాకర్‌రావు, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, ఫైనాన్స్ రామచంద్ర పాల్గొన్నారు.

'త్రివేణి' విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు

కొత్తగూడెంరూరల్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డిస్ట్రిక్ అసోసియేషన్ తరుపున త్రివేణి స్కౌట్స్ విద్యార్థులు గౌతమ్, హర్షవర్ధన్, ధీరజ్‌గాంధీ, సిద్ధు, నాగసాత్విక్, కార్తిక్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర స్థాయిలో టాలెంట్ కాంపిటేషన్ సర్టిఫికెట్ క్యాంపులో ప్రతిభ చాటారని విద్యా సంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి తెలిపారు. ఆదివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ సురేష్, శ్రీనివాస్‌సింగ్, స్కౌట్ మాస్టర్ రవికిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాగిరెడ్డి

ఇల్లెందు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలని, తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రతిష్టలు తీసుకుని రావాలని సాహితీ కళాశాల డైరెక్టర్ ఎంసీ నాగిరెడ్డి అన్నారు. ఆదివారం సాహితీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సరస్వతీ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు, విశ్వశాంతి విద్యాలయం హైస్కూల్ డైరెక్టర్ తుమ్మలపల్లి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ గుజ్జర్లపూడి రాంబాబు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌తో కళకళ..

- రూ.38 లక్షల వ్యయంతో లైటింగ్ పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు



సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ స్తంభాలు

సుజాతనగర్: సుజాతనగర్ మండల కేంద్రం ఇకపై సరికొత్త శోభను సంతరించుకోనుంది. త్వరలో హైమాస్ట్ లైట్లు వెలుగులీననున్నాయి. ఒకప్పుడు కొత్తగూడెంలో విలీనమై ఉన్న సుజాతనగర్‌ను 2016లో మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం, పల్లె పట్టణమనే తేడా లేకుండా ప్రగతి విస్తృతమైంది. నిరంతర విద్యుత్, తాగునీరు, రహదారులు, ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు ఇలా అన్నీ అందుబాటులోకి వస్తున్నాయి. సుజాతనగర్ ప్రాంత ప్రజలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న సెంట్రల్ లైటింగ్ కూడా మరో వారం రోజుల వ్యవధిలో అందుబాటులోకి రానుంది.

శరవేగంగా నిర్మాణ పనులు..

మండల అభివృద్ధిపై కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గంలోని ఒక్కో మండలానికి ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూ చేయిస్తూ కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలో కొంతభాగం నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించడంతో పాటు, మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో పట్టణాలకు తీసిపోని విధంగా తీర్చిదిద్దుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్ బల్బుల కారణంగా విద్యుత్‌శాఖపై 10 కేవీ మేర విద్యుత్ భారం పడనుంది.

ఎక్కువ భాగం డివైడర్ లేకుండానే...

కొత్తగూడెం నియోజకవర్గానికి ముఖద్వారంగా నిలిచే సుజాతనగర్ మండలంలో ప్రధాన రహదారిపై సింహభాగం మేర డివైడర్ నిర్మాణం లేదు. నియోజకవర్గ ప్రారంభ గ్రామమైన నాయకులగూడెం నుంచి రైల్వే వంతెన వరకు రోడ్డును విస్తరించాల్సి ఉంది. ప్రస్తుతం సుజాతనగర్ మండల కేంద్రంలో 1.4 కిలోమీటర్ల మేర మాత్రమే డివైడర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలోనే సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన ప్రాంతంలో రహదారి విస్తరణ జరగకపోవడంతో రోడ్డు ప్రమాదాలు కూడా భారీగానే చోటుచేసుకుంటున్నాయి. నియోజకవర్గ ప్రారంభం నుంచి వేపలగడ్డ గ్రామం మీదుగా రైల్వే వంతెన వరకు రహదారిని విస్తరించడంతో పాటు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలకు చెక్...

మండల కేంద్రం సుజాతనగర్‌లో ఎట్టకేలకు సెంట్రల్ లైటింగ్ పనులకు మోక్షం లభించింది. 12వ రాష్ట్రీయ రహదారి విస్తరణకు సంబంధించి డివైడర్ల నిర్మాణం పూర్తై రెండేళ్లు గడిచినా ఇంతవరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయలేదు. సెంట్రల్ లైటింగ్ పనుల్లో జాప్యం తలెత్తడంతో ప్రజలు, వాహనదారులు రాత్రిపూట అంధకారంతో ఇబ్బందులు పడ్డారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, ప్రజల విజ్ఞప్తుల మేరకు సీడీపీ (నియోజకవర్గ అభివృద్ధి నిధులు) రూ.38 లక్షలతో చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. 1.4 కిలోమీటర్ల మేర సుమారు 27 మీటర్లకు ఒక్కటి చొప్పున మొత్తం 27 స్తంభాలను డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాన సెంటర్ ఒక స్తంభానికి హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయనున్నారు. రాత్రి వేళల్లో చీకటిలో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో... ఇకపై ప్రమాదాలకు చెక్ పడనుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వనమా(ఫైల్)

కలలో కూడా ఊహించ లేదు



సుజాతనగర్‌లో నాలుగు వరుసల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ వస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఒక వైపు సీసీ, బీటీ రోడ్లు, ప్రధాన రహదారి విస్తరణ సెంట్రల్ లైటింగ్‌తో మండల కేంద్రం కొత్త రూపు సంతరించుకోనుంది.

– మిరియాల రామకృష్ణ, సుజాతనగర్

రోడ్డు ఇంకా విస్తరించాలి



ప్రధాన రహదారిని ఇంకా విస్తరించాలి. డేగలమడుగు గ్రామం నుంచి నాలుగు లేన్ల రహదారిగా విస్తరిస్తే రోడ్డు విశాలంగా అవుతుంది. దీనివలన ప్రమాదాలు తప్పుతాయి. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

– మండె నాగరాజేశ్వరి, నాయకులగూడెం సర్పంచ్

వారంలోగా ప్రారంభిస్తాం



సుజాతనగర్‌లో వారం రోజులుగా సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సీడీపీ నిధులు రూ.38 లక్షలతో ఈ పనులు సాగుతున్నాయి. వారం లోగా పనులు పూర్తి చేసి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు లైట్లు వెలిగిస్తాం.

– శివలాల్, పీఆర్ ఏఈ

శివాలయ కమిటీని రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

సుజాతనగర్: ఇటీవల నూతనంగా ఎన్నికైన శివాలయ కమిటీలో దళితులకు చోటులేకుండా చేసి అవమానించారని, తక్షణమే శివాలయ కమిటీని రద్దు చేయాలని దళిత ఐక్య వేదిక సంఘం డిమాండ్ చేసింది. ఆ సంఘం ఆధ్వర్యంలో పలువురు నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి శివాలయం కమిటీలో దళితులు ఉన్నారని, ఇటీవల వేసిన కమిటీలో దళితులకు అవకాశం ఇవ్వకపోవడం సరియైంది కాదన్నారు. ఇదేమిటని అడిగితే ప్రమాణ స్వీకారం రోజు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని, తీరా ప్రమాణ స్వీకారానికి వెళ్లిన దళిత వ్యక్తిని వేదిక పైకి పిలవకుండా అవమానించారని ఆరోపించారు. రాజ్యాంగం ప్రకారం దళితులకు సభ్యత్వాన్ని ఇవ్వడంతో పాటు, చైర్మన్ పదవిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక నాయకులు మురిపిటి వెంకటేశ్వర్లు, కత్తి వెంకన్న, కాకటి బాబు, దామెర్ల సర్వేశ్వరరావు, వేల్పుల భాస్కర్, సిద్దెల నరేందర్, కత్తి యోగేష్, గుండేటి రాములు, కత్తి కష్ణ, రాములు, మురిపిటి నగేష్, మహేష్, కత్తి శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాల్వంచ: నేడు పాల్వంచ కేఎస్‌పీ రోడ్‌లో విద్యుత్ లైన్ల మార్పు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రేమను పంచడమే భక్తికి నిదర్శనం



బోధనలు చేస్తున్న పాస్టేట్ చైర్మన్ అభిజిత్

ఇల్లెందురూరల్: ప్రభువైన యేసుకు మనస్ఫూర్తిగా సమర్పించే ఫలమే కోతకాలపు పండుగ అని ఖమ్మం పాండురంగాపురం పాస్టేట్ చైర్మన్ అభిజిత్ అన్నారు. మండలంలోని మామిడిగూడెం గ్రామపంచాయతీ సుంకరగూడెం చర్చిలో కోతకాలపు పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన దైవబోధనలు వినిపించారు. మంచిని ప్రేమించి ప్రదర్శించడం భక్తికి నిదర్శనంగా పేర్కొన్నారు. దీనికోసం ప్రతి ఆదివారం దేవున్ని ప్రార్థించే సమయంలో సంతోషంగా గడపాలని సూచించారు. ఏడాదిపాటు సంపాదించిన సొమ్ములో దశమ భాగం నిత్యం ఆరాధించే ప్రభువైన యేసుకు సంతోషంగా సమర్పించుకుంటారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘ కాపరులు, గ్రామ పెద్దలు డేవిడ్‌రాజ్, శామ్యూల్, గర్రం శ్యామ్యూల్, ఏసురత్నం, శ్రీనివాస్, ఇమ్మానుయేలు, దయానంద్, జాషువా, స్వామిదాసు, ఉపసర్పంచ్ తోకల ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

మార్చి 3న వేంకటేశ్వర స్వామి కల్యాణం

టేకులపల్లి: సంపత్‌నగర్ కొండపై వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలు మార్చి 2 నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అభిషేకం, స్వామి వారి అలంకరణ, పెండ్లి కొడుకును చేయుట, సాయంత్రం విష్ణుసహస్రనామ స్తోత్రపారాయణం, అఖండ దీపారాధన 3న ఉదయం సుప్రభాతసేవ, యాగశాల అర్చన, నిత్య హవనం, 10 గంటలకు స్వామివారి కల్యాణ మండప ప్రవేశం, 10.30కు స్వామి వారి కల్యాణ ఘట్టం ఆరంభం, మధ్యాహ్నం 12.39కు సుముహూర్తం, అనంతరం అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమం తప్పదు



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

సింగరేణి(కొత్తగూడెం): పాత బంగారుచెలక పంచాయతీ పరిధిలో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య హెచ్చరించారు. ఆదివారం ఆ పార్టీ పట్టణ కార్యదర్శి పెద్దబోయిన సతీష్, ఆజాద్ అధ్యక్షతన జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పంచాయతీ పరిధిలో సుమారు వెయ్యి మంది గిరిజనులు 381 సర్వే నంబరులోని 3,000 వేల ఎకరాల భూమిని ఏళ్ల తరబడి సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారని వారికి నాటి ప్రభుత్వం రెవెన్యూ పట్టదారు పాస్ పుస్తకాలు ఇచ్చి ప్రభుత్వ పథకాలను కొనసాగించినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అట్టి పట్టాలను రద్దు చేయటం సరికాదన్నారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి మాచర్ల సత్యం, జిల్లా నాయకులు ఆజాద్, సతీష్, పూనెం నరసింహారావు, బాద పాపారావు,, గోపి నరసయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అధిష్టానం గుప్పిట్లో అవిశ్వాసం 'గుట్టు'

ఇల్లెందు: 20 రోజుల పాటు సంచలనంగా మారిన ఇల్లెందు మున్సిపల్ కౌన్సిలర్ల అవిశ్వాసం గుట్టు అధిష్టానానికి చేరింది. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పోకడలను వ్యతిరేకించిన మెజార్టీ కౌన్సిలర్లు ఈ నెల 6వ తేదీన కలెక్టర్‌కు నోటీసు అందజేసిన విషయం విధితమే. ఈ క్రమంలో కలెక్టరేట్‌లో చోటు చేసుకున్న పరిణామాల నుంచి క్యాంపు వీడి ఇల్లు చేరే నాటికి నాటకీయ పరిణాలు చోటు చేసుకున్నాయి. తెలంగాణ మినహా ఇతర ప్రాంతాల్లో క్యాంపు రాజకీయాలు నడిపారు. అవిశ్వాసం నోటీసు గడువు మీరింది. కలెక్టర్ నుంచి స్పందన లేకపోవటంతో హైకోర్టును ఆశ్రయించారు. చిలికి చిలికి గాలివానలా మారిన అవిశ్వాసం అంశం రాష్ట్ర రాజధానికి చేరింది. ఒకటి కాదు.. రెండు కాదు.. 25కు పైగా రాష్ట్రంలోని మున్సిపాల్టీల్లో అవిశ్వాసం అంశాలు తెర మీదకు వచ్చాయి. ఈ పోరు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇల్లెందు, వైరాలో తారాస్థాయికి చేరింది. ఈ పరిణామాలు అధికార పక్షాన్ని అతలాకుతలం చేసింది. అయితే బీఆర్‌ఎస్‌లోనే పాలక ప్రతిపక్షాలుగా మారి అవిశ్వాసం అంశం రచ్చ చేశాయి. మరికొన్ని మున్సిపాల్టీలు బీజేపీ పంచన కూడా చేరాయి. ఈ నేపథ్యంలో అవిశ్వాసం అంశాన్ని ప్రభుత్వం అణచివేస్తోంది. ఇక మొదటి నుంచి ఇల్లెందులో అవిశ్వాసం అంశం రెండు వర్గాల మధ్య పోరుగా మారింది. చైర్మన్ డీవీకి వ్యతిరేకంగా 12 మంది కౌన్సిలర్లు ఏకమయ్యారు. అవిశ్వాసం కోసం ప్రయత్నించిన వారిని నయాన భయాన ఇల్లెందుకు రప్పించే ప్రయత్నాలు చేశారు. ఎమ్మెల్యే హరిప్రియ, ఎమ్మెల్సీ తాతా మధు అనేక ప్రయత్నాలు చేశారు. ఇల్లెందులో అవిశ్వాసం కౌన్సిలర్ల ఇళ్ల ఎదుట ఆందోళనలు చేశారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

ఇల్లెందులో ఇరువర్గాలు సోషల్ మీడియాను అవసరానికి మించి వాడుకున్నారు. దీనివల్ల రెండు వర్గాల మధ్య తీవ్ర అగాధం పెరిగింది. ఈ క్రమంలో కోర్టు వాయిదా మార్చి 21వ తేదీకి వాయిదా పడింది. కౌన్సిలర్లు ఇంటి దారి పట్టారు. టీఆర్‌ఎస్ అధిష్టానాన్ని సంప్రదించారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. వరంగల్‌లో పల్లా నివాసంలో ఎమ్మెల్యే హరిప్రియ, తాతా మధుల సమక్షంలో కౌన్సిలర్లతో పల్లా రాజేశ్వరరెడ్డి చర్చించారు. ఈ నెల 6వ తేదీ నుంచి నేటి వరకు జరిగిన అసమ్మతి కౌన్సిలర్ల అంశాన్ని ఆలకించిన పల్లా పలు సూచనలు చేసి కథ ముగించారు. అక్కడికి చేరిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కూడా కౌన్సిలర్ల ఎపిసోడ్‌లో జోక్యం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అవిశ్వాసం కోరిన అసమ్మతి కౌన్సిలర్లు ఎట్టకేలకు క్యాంపు వీడి ఇల్లెందుకు చేరారు. ఈ నెల 28న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఇరువర్గాల కౌన్సిలర్లు కలుసుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే మరో 10 నెలల పాటు అసమ్మతిని చల్లార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి నూతన ప్రభుత్వం అధికారం చేపడుతుంది. అప్పటికి మున్సిపాల్టీలకు మళ్లీ అవిశ్వాస కాల పరిమితి ముగుస్తుంది. అవిశ్వాసం అంశం మళ్లీ తెరమీదకు వచ్చే చాన్స్ ఉందని గుసగుసలాడుకుంటున్నారు.

ఎల్‌ఓసీ అందజేసిన ఇల్లెందు ఎమ్మెల్యే



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బానోతు హరిప్రియ

టేకులపల్లి: టేకులపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన జోగ సుమన్‌కృష్ణ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నారు. బీఆర్ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ సీఎంఆర్ఎఫ్‌కి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు బాధితుడి వైద్య ఖర్చులకు గాను ఆదివారం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కుని కృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, సొసైటీ వైస్‌చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్‌చౌదరి, మండల ఉపాధ్యక్షుడు చీమల సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి ఇస్లావత్ బాలు నాయక్, గంగారం గ్రామ శాఖ అధ్యక్షుడు అక్కెనపల్లి శ్రీనివాస్, రాకేష్, అభినయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

జూలూరుపాడు: మార్చి 1, 2 తేదీల్లో మిర్యాలగూడలో జరగనున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం కొమ్ముగూడెం గ్రామంలో జరిగిన గిరిజన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాల ఫలితంగానే పోడు సాగుదారులకు పట్టాల పంపిణీ, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ ప్రభుత్వం కల్పించిందన్నారు.

రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్ ఉద్యమాల రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీలకు అభివృద్ధి బోర్డు, మిగిలిన పోడు భూములపై సర్వే చేపట్టి పట్టాలు ఇవ్వాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బానోత్ ఇస్రా, బానోత్ మధు, మోతీలాల్, మోతీబాయి, కోటేష్ పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



భోగ్‌బండారో సమర్పిస్తున్న పూజారి

సుజాతనగర్: సర్వారం గ్రామ పంచాయతీ ఒడ్డుగూడెం తండాలో సేవాలాల్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజారి మిట్టుస్వామి ఆధ్వర్యంలో భోగ్‌బండారో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బంజారాల భగవత్ స్వరూపం సంత్ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. గిరిజనులంతా భక్తితో కొలుచుకునే సేవాలాల్ గొప్ప ఆధ్యాత్మిక వేత్త, సంఘసేవకుడని కొనియాడారు. ప్రతి గిరిజనుడు సేవాలాల్ బోధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఎంపీటీసీ విజయ్, నాయకులు బాదావత్ రాము, జుంకీలాల్, మేగ్యా, మంగీలాల్ నాయక్ పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న సాబీర్ పాషా

పాల్వంచ: ఏళ్ల తరబడి పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతర పేదలకు పోడు హక్కులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ పట్టాలు మంజూరు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులు స్పందించాలని, నీటి సమస్య పరిష్కారానికి వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. తక్షణమే పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. పాల్వంచ మున్సిపాలిటీలో అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్య వేధిస్తోందని, మంచినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడం లేదని ఆరోపించారు. అర్హులైన వారందరికీ డబల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్లు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముత్యాల విశ్వనాథం, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుండాల నాగరాజు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, పద్మజ, వేముల వెంకటేశ్వర్లు, అన్నారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వాలీబాల్ టోర్నీ

ఇల్లెందురూరల్: మామిడిగుండాల గ్రామపంచాయతీ మేడికుంట గ్రామంలో ఈనెల 28, మార్చి 1, 2వ తేదీలు మూడు రోజులపాటు ఏడు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లెందు, కారేపల్లి, గుండాల, ఆళ్లపల్లి, కొత్తగూడ, గంగారం, పినపాక, కరకగూడెం మండలాలకు చెందిన క్రీడాకారులు ఈపోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.పదివేలు, ద్వితీయ రూ.8వేలు, తృతీయ రూ.6వేలు, నాలుగో బహుమతిగా రూ.5వేలు, జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు.

ఆసక్తి కలిగి క్రీడాకారులు 8790299913, 8790691757, 9989897406 సెల్ నంబర్లలో సంప్రదించి డ్రా తీయడానికి ముందే తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలని సూచించారు.

దేశ సంపదంతా కార్పొరేట్ శక్తులకే..



మహాసభకు హాజరైన కార్యకర్తలు




మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇల్లెందు: మోదీ నాయకత్వంలో హిందూత్వ శక్తులు అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని పరిశ్రమలు, వనరులు, సంపదలు, భూములు, అడవులన్నీ అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాడని, నేడు అదానీ ఆస్తులు అడ్డగోలుగా పెరిగిపోవడానికి మోదీ అండదండలే కారణమని బీబీసీ సవివరంగా బయటపెట్టిందని, దీంతో మోదీకి బినామీ అదానీ అని స్పష్టమవుతోందని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఇల్లెందులోని పాత బస్టాండ్ సెంటర్‌లో ముసాఫిర్‌ఖానాలో జరిగిన ఇఫ్టూ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. అదానీ అక్రమాస్తులు స్వాధీనం చేసుకోవాలని, సుప్రీంకోర్టు జడ్జిలతో విచారణ జరిపించాలని, కేంద్రం అడ్డుకోరాదని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో కార్మికవర్గం కార్మిక చట్టాలను సాధించి అనుభవిస్తున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను కార్పొరేట్లకు బడా పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా మార్చిందని ఆరోపించారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పరిశ్రమల రక్షణ, ఉద్యోగ భద్రత, ఉపాధి కోసం బలమైన కార్మిక పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీతారామయ్య, కోషాధికారి ఎండీ రాసుద్దీన్, రాష్ట్ర నాయకులు బి.రాంసింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.విశ్వనాథం తదితరులు ప్రసంగించారు. బి.రమేష్, ఎల్.మారుతీరావు, మూతి రాంబాబు అధ్యక్షత వహించగా జే.సీతారామయ్య ఇఫ్టూ జెండా ఆవిష్కరించారు. కొండపల్లి శ్రీనివాస్, పి.లింగయ్య, అలీముద్దీన్, గట్టయ్య, చారీ, బద్రు, మురళీ, బాలు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పశువైద్యశాలకు ప్రహరీ ఏది?

సుజాతనగర్ మండల కేంద్రంలోని పశువైద్యశాల ఏళ్ల తరబడి ప్రహరీ నిర్మాణానికి నోచుకోవడం లేదు. దీంతో ఆవరణలో పశువులు, కుక్కలు సంచరిస్తున్నాయి. వైద్యశాలకు మరోవైపున ఉన్న ప్రహరీ శిథిలావస్థ చేరుకొని కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ప్రహరీ నిర్మించాలని మండల రైతులు కోరుతున్నారు. -సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : జి.నాగులు, పశువైద్యాధికారి, సుజాతనగర్
సెల్ నంబర్ : 9440597361